క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

సారవకోట: మండలంలోని చీడిపూడిలో శుక్రవారం అలుదు గ్రామానికి చెందిన పంగ ఉదయ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో జెమ్స్ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే అక్కడే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 368 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

ప్రభాకర్‌ను విడుదల చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌పై ఎన్ఐఏ పోలీసులు అక్రమంగా కేసు బనాయించి, గడిచిన రెండేళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లోని జైల్‌లో నిర్బంధించారని, వెంటనే ఆయనను విడుదల చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 19వ తేదీన ఒంగోలులో జరగనున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్రస్థాయి సదస్సు కరపత్రాలను చింతాడలో శుక్రవారం విడుదల చేశారు. సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు మన్నేన నీలంనాయుడు, ఉప్పినివలస చలమయ్య, వంక సాయికుమార్, రాగోలు బాలకృష్ణ, శ్రవణ్ కుమార్, తోట రాజేష్, భార్గవి, హారతి తదితరులు పాల్గొన్నారు.

బాలింతల మృతిపై ఆరా



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీలో ప్రసూతి ఆపరేషన్ చేయడం వలన బాలింతల మృతిపై నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆరా తీశారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించి వైద్యులు, వైద్య సిబ్బందితో మృతి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అదే రోజు ప్రసూతి ఆపరేషన్ చేసుకున్న మరో బాలింతను పరామర్శించి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సర్పంచ్ పొన్నాన శంకరరావు, వైద్యులు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం గ్రామానికి చెందిన నాయుడు గారి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన తర్ర బలరామ్, తర్ర కృష్ణ, నేతింటి గడ్డయ్య, వాన అప్పన్న, రమేష్, పైడి లక్ష్మీనారాయణలపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. వసతి గృహంలో వార్డన్ బి.రమణ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించలేదని, అలాగే ఇటీవల జరిగిన ఉపాధి పనులు(సీసీ రోడ్లు) నాణ్యతగా లేవని రాజశేఖర్ జిల్లా కలెక్టర్‌తోపాటు అమరావతిలో ఫిర్యాదు చేశాడు. దీనిలో భాగంగా వసతి గృహంలో విచారణ జరుగుతున్న సమయంలో సదరు వ్యక్తులు అరటి దవ్వలతో దాడిచేసి గాయం చేసినట్లు రాజశేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే బలరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అధిక జనాభా వలన కలిగే నష్టాలను మేధావులు వివరించారు. యువత ఉచిత పథకాల కోసం కాకుండా, ఉపాధి మార్గాలు అన్వేషించాలని సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఏడాది పాలన మోసాలమయం



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కక్ష పూరితంగా పాలన: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



రాష్ట్రంలో కూటమి పాలన కక్ష పూరితంగా సాగుతోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అంటే కూటమి నాయకులు భయపడుతున్నారని, అందుకే అతని పర్యటనలకు అనేక ఆంక్షలు పెడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చి తామే ఈ పథకాల రూపకర్తలమని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రైతులను అన్ని రకాలుగా దగా చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అని ప్రజలకు వివరిస్తూ, రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు.

- కూటమి పాలనలో అన్నివర్గాలకూ వంచన
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కృష్ణదాస్

నరసన్నపేట: ఏడాది కూటమి పాలన అంతా మోసాలమయమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలో పోలాకి రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టోపై నరసన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలన వెన్నుపోట్లుకు నిలయమని, ఇటువంటి ప్రభుత్వ పాలన గతంలో ఎన్నడూ రాష్ట్రంలో చూడలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అంటే మోసం.. చంద్రబాబు అంటే వెన్నుపోటు అనేది మరోసారి రుజువైందని దుయ్యబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పక్కాగా విజయం సాధిస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



హాజరైన కార్యకర్తలు, నాయకులు

కార్యక్రమంలో కాళింగ కుల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, నరసన్నపేట, పోలాకి ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ముద్దాడ బైరాగి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, బగ్గు రామకృష్ణ, జీవీ రమణి, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, దండి జయప్రకాశ్, మొజ్జాడ శ్యామ్, కనుసు సీతారాం, కణిత కృష్ణారావు, ఉకలాపు రవి, వరుదు వంశీ కృష్ణ, నక్క తులసీదాస్, దోమ మన్మథరావు, చింతు రాఘవరావు, బూరల్లి శంకర్, యాళ్ల శ్యామ్‌సుందరరావు, రెంటికోట త్రినాథరావు, దోల సాయి, చింతల వెంకటరమణ, రావాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాది చంద్రబాబు: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



చంద్రబాబు ఎంతటి అవకాశవాదో, వెన్నుపోటుదారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. చంద్రబాబు ఏడాది పాలన సుపరిపాలన కాదు.. దగా పాలన అని అభివర్ణించారు. కుట్రలు, హత్యలు, అత్యాచారాలు, అన్యాయాలు, అరాచకాలకు నిలయంగా రాష్ట్రం మారిందని దుమ్మెత్తిపోశారు. తప్పుడు కేసులతో మాజీ మంత్రులను, సీనియర్ ఐఏఎస్ అధికారులను జైళ్లలో పెట్టారని విమర్శించారు. ప్రకృతి వనరులను తీవ్రంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యంతో కుటుంబాలు నాశనమవుతున్నాయని పేర్కొన్నారు. కూటమి పాలనను బంగాళాఖాతంలో కలిపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలన మళ్లీ వస్తుందని, ఈసారి కార్యకర్తలకు పూర్తిగా న్యాయం జరుగుతుందని తెలియజేశారు.

రైతులకు తీవ్రమైన మోసం: కరిమి రాజేశ్వరరావు



కూటమి ఏడాది పాలనలో రైతులకు తీవ్రమైన మోసం చేశారని డీసీసీబీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కరిమి రాజేశ్వరరావు అన్నారు. వ్యవసాయం దండగ అని సీఎం హోదాలో చంద్రబాబు అప్పట్లో అన్నారని, ఇప్పుడు తన నిజ స్వరూపం మళ్లీ చూపించి రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందించడం లేదన్నారు. పండిన పంటను కొనుగోలు చేయడం లేదని, ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేశారని పేర్కొన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ లేదని విమర్శించారు. ఏడాది కూటమి పాలనలోనే ఏం నష్టపోయామో రైతులు గ్రహించారని, అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు.

సమన్వయంతో పనిచేద్దాం: పోలాకి జెడ్పీటీసీ కృష్ణచైతన్య



నరసన్నపేట నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతానికి సమన్వయంతో పనిచేద్దామని పోలాకి జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ధర్మాన కుటుంబానికి నరసన్నపేట పెట్టని కోటగా ఉందన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడవద్దని హామీనిచ్చారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల స్థాయిల్లో నిర్వహించనున్నామని, దీంట్లో కూడా కార్యకర్తలు బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ



అవగాహన కల్పిస్తున్న జడ్జి వాణి

నరసన్నపేట: మధ్యవర్తిత్వం ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి వీలవుతుందని న్యాయవాదులు, కక్షిదారులు ముందుకు రావాలని నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులకు శుక్రవారం అవగాహన కల్పించారు. శుక్రవారం నుంచి 16వ తేదీ వరకూ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీపీ సంతోషి, న్యాయవాదులు జీవీజీ నాయుడు, జి.అప్పారావు, వై.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు గురించి తెలుసుకోవాలి



డబారు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న చిరంజీవిరావు

మెళియాపుట్టి: గిరిజనులు తమ హక్కులు గురించి తెలుసుకోవాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యుడు నాగరాజు అన్నారు. మండలంలోని డబారు గ్రామంలో గిరిజన హక్కులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ చిరంజీవిరావు, ఏరియా కో–ఆర్డినేటర్ జగన్నాథం మాట్లాడుతూ.. గిరిజన ప్రజలు పోడు పట్టాలు పొందడం, అటవీ హక్కులు, చిల్లర ఫలసాయం, చేపలు పట్టుకునే హక్కుల గురించి తెలియజేశాడు. హక్కుల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో నవర ఆంజనేయపురం, పొగడవెల్లి, డబారు, చిన్నసున్నాపురం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



జలుమూరుమాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలనాయుడు

జలుమూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్, ఆరోగ్యకర్తలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పురోగతికి అవసరమయ్యే సమాచారం సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆయా పనులు, వనరులపై నివేదికలు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి బి.మాధవరావు, విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కాళీప్రసాద్

హిరమండలం: పంచాయతీల అభివృద్ధికి సరైన ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీవో కాళీప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక పేరిట ఒక రోజు శిక్షణనిచ్చారు. అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపీడీవో వివరించారు. వర్షాకాలం దృష్ట్యా అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, ఈవోపీఆర్డీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ



బూర్జ: బొమ్మికలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

బూర్జ: అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.వి. సత్యనారాయణ సూచించారు. మండలంలోని పెద్దపేట పంచాయతీ బొమ్మిక గిరిజన గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా క్లోరినేషన్ చేయించడం జరిగిందన్నారు. అనంతరం బూర్జ పీహెచ్‌సీలో తనిఖీలు చేపట్టారు. జ్వర పీడితుల నుంచి సేకరించిన రక్త నమూనాలు పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కె.సూర్య అప్పారావు, ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.రాజశేఖర్, ఈవోపీఆర్డీ పి.విజయలక్ష్మి, సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, టి.తేజారావు, పంచాయతీ కార్యదర్శి జి.కల్యాణబాబు, ఏఎన్ఎంలు ఎ.రమణమ్మ, టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: ఎల్ఎన్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్ఎన్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీత సూచించారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎల్ఎన్‌పేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమలతోనే డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. తాగిపడేసిన కొబ్బరి బోండాలు, సీసాలు, ఇతరత్రా వ్యర్థాలను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, వసుధ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాతపట్నం: మండలంలోని రొంపివలస సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపివలస సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రొంపివలస, సీది, పాశీగంగుపేట, తీమర, తామర, సొద, కొమనాపల్లి, ఆర్.ఎల్.పురం, రైతుపురం, ఏ.ఎస్.కవిటి, చాకిపల్లి, ఎస్.ఎస్.మనుగు, బైదలాపురం, పెద్ద సున్నాపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పాతపట్నం: మండల కేంద్రంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, దేవాలయాలు, పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులను స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వే బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన బృందం సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే జ్వరాలు ప్రబలడం జరుగుతుందన్నారు. వారితో పాటు ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో తిరుపతి పట్నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనూరాధ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

హిరమండలం: గర్భిణులు సరైన వైద్యంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని చొర్లంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్‌కుమార్ సూచించారు. శుక్రవారం పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా చొర్లంగి పీహెచ్‌సీలో 34 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన ఆహారం, మందులపై అవగాహన కల్పించారు.

పశువులకు టీకాలు వేయించాలి

పాతపట్నం: నాలుగు మాసాలు దాటిన ఆవు జాతి పశువులకు లంపి స్కిన్ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలోని పెద్దసీది గ్రామంలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆయనతో పాటు పశువైద్యులు బి.వాణిశ్రీ, పి.అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పూడిక తొలగింపు



గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

నరసన్నపేట: ఈనెల 7వ తేదీన కాలువలు ఇలా.. సాగునీరు ఎలా.. అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా మండలంలోని కిల్లాం ఛానల్‌లో గుర్రపు డెక్క, పూడికతీత పనులు శుక్రవారం చేపట్టారు. నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

బోరు వినియోగించేదెలా..?



సారవకోట మండలంలోని బుడితి సీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో ఉన్న మంచినీటి బోరును వినియోగించేది ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం నుంచి ఇక్కడ బోరు ఉండగా, ఇటీవల ఆస్పత్రికి వెళ్లేందుకు సిమ్మెంట్ రోడ్డు వేశారు. దీంతో రోడ్డు ఎత్తు పెరగడంతో బోరును వినియోగించేందుకు అవకాశం లేకుండా పోయింది.

– సారవకోట

శిథిలావస్థలో బస్ షెల్టర్



సరుబుజ్జిలి మండలంలోని తమ్మినాయుడుపేట జంక్షన్ వద్ద నిత్యం ప్రయాణికులు వేచి ఉండే బస్ షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. షెల్టర్‌కు సంబంధించిన పిల్లర్లు పూర్తిగా బీటలువారాయి. గోడలు, స్లాబుల పెచ్చులూడిపోతున్నాయి. బస్సులు కోసం తమ్మినాయుడుపేట, డకరవలస, సుభద్రాపురం, కొండ్రగూడ, బక్కిరిపేట గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి వేచి ఉంటారు. అందువలన ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

అటెన్షన్ ప్లీజ్



సారవకోట మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలంలోని కొమనాపల్లికి వెళ్లే రహదారిలో బుడితి జంక్షన్‌కు సమీపంలో కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. ఈ గోతిలో బాటసారులు, ద్విచక్ర వాహనదారులు పడిపోకుండా ఉండేందుకు స్థానికులు రాళ్లతో పూడ్చారు. ఈ రహదారి పూర్తిగా పాడైపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– సారవకోట

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి ఎస్ఎస్ కాలనీలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు లేకపోవడంతో వీధిలో ప్రజలు పడుతున్న సమస్యలు తెలుసుకొని రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎల్.తులసీవరప్రసాదరావు, వై.శ్రీనివాసరావు, పి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724, 7075499517
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com